మాజీ సర్పంచ్ సీతయ్య మృతి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం చందక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రెడ్డి సీతయ్య (72) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. ఆయన కొంతకాలంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడిగా, చందక గ్రామ సర్పంచ్‌గా 1995 నుండి 2000 వరకు ప్రజలకు సేవలందించిన సీతయ్య ప్రజల్లో విశ్వాసం పొందారు. ఆయన మరణవార్త తెలిసి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన భౌతికకాయాన్ని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కోరాడ రాజబాబు, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, తర్లు వాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఆయనకు ఘన నివాళులర్పించారు.

రోడ్డు మార్గంలో జగన్ పర్యటనకు
అనుమతి లేదు

హెలికాప్టర్లో అయితే ఓకే... స్పష్టం చేసిన పోలీసులు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఈనెల 9వ తేదీన మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఆందోళనలో భాగంగా చేపట్టనున్న పర్యటనలో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. విశాఖలో జగన్ పర్యటనకు అనుమతి లేదని విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. జగన్ పర్యటన రోజే విశాఖలో మహిళల ప్రపంచ కప్ మ్యాచ్ ఉందని, దీనికి ప్రజలు భారీగా హాజరయ్యే అవకాశమున్నందున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. విశాఖ నుంచి జగన్ రోడ్ మార్గంలో మాకవరపాలెం వెళ్లే యోచనలో ఉన్నట్టు చెప్పారు. వైసీపీ శ్రేణులు ర్యాలీగా వెళ్తే జాతీయ రహదారి బ్లాక్ అవుతుందని, రోడ్ బ్లాక్ అయితే తమిళనాడులో విజయ్ ర్యాలీలో జరిగినట్టు తొక్కిసలాట జరగవచ్చు అన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఆయన పర్యటనకు అనుమతి ఇవ్వలేమన్నారు. ఇదే విషయాన్ని నేరుగా వారికి లేఖలో తెలియజేస్తున్నామని సీపీ తెలిపారు. అయితే అటు అనకాపల్లి జిల్లా ఎస్పీ మాత్రం హెలికాప్టర్ ద్వారా మాకవరపాలెం చేరుకుంటే అనుమతిస్తామని తెలియజేశారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం పర్యటనకు ఈ నెల 9న మాజీ సీఎం జగన్ రానున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మీడియా సమావేశం నిర్వహించారు. విశాఖపట్నం నుంచి మాకవరపాలెం వరకు హెలీకాప్టర్‌లో వచ్చేందుకు ఆయనకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో మాట్లాడారు. విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ నుంచి మాకవరపాలెం వరకు 63 కి.మీ మేర రోడ్డుమార్గం ద్వారా జగన్ వచ్చేందుకు వైసీపీ నేతలు దరఖాస్తు చేశారని, జాతీయ రహదారిపై ముఖ్య కూడళ్ల వద్ద జన సమీకరణ చేపట్టి ప్రదర్శన చేస్తారన్న సమాచారం ఉందని, దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయంతోపాటు ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఇటీవల తమిళనాడులోని కరూర్లో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందారని, అలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా విశాఖపట్నం నుంచి మాకవరపాలేనికి హెలికాప్టర్లో వచ్చేలా జగన్ చొరవచూపాలని ఎస్పీ తెలిపారు.

గురుకులం విద్యార్థినులకు ఆరోగ్య శాఖ మంత్రి పరామర్శ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: అస్వస్థత, అనారోగ్యానికి గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థినులను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పరామర్శించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌లతో కలిసి మంగళవారం మధ్యాహ్నం మంత్రి కేజీహెచ్‌కు వెళ్లారు. క్యాజువాలిటీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 53 మంది చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు రాగా మంగళవారం 13 మంది డిశ్చార్జి అయినట్లు మంత్రి వెల్లడించారు. పూర్తిస్థాయిలో నయమైన తర్వాత మిగిలిన వారిని ఒకటి, రెండు రోజుల్లో డిశ్చార్జి చేయిస్తామని చెప్పారు. కురుపాం ఘటనపై, అక్కడి పరిస్థితులపై విచారించేందుకు ఇప్పటికే అధికారుల బృందం వెళ్లిందని మంత్రి గుర్తు చేశారు. ఆ నివేదికల ఆధారంగా భవిష్యత్తు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట కేజీహెచ్ సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఎంవో, అడ్మినిస్ట్రేటర్, ఇతర వైద్యాధికారులు ఉన్నారు.

సీజేఐపై దాడికి వ్యతిరేకంగా సీపీఐ నిరసన

విశాలాంధ్ర - విశాఖ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయిపై న్యాయవాది రాకేష్ కిషోర్ మతోన్మాద దాడిని సీపీఐ ఖండించింది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన నిరసనలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ వందేళ్ల ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తులు దేశ ప్రజల మధ్య మతవిద్వేషాలను రెచ్చగొడుతున్నాయని విమర్శించారు. సీజేఐపై దాడి దీనికి నిదర్శనం అన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, దీని వెనక ఉన్న శక్తులను బయట పెట్టాలన్నారు. సనాతన ధర్మం పేరుతో రాజకీయాలు చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీనిపై స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.మన్మధరావు, ఎస్.నాగభూషణరావు, ఎంఏ బేగం, కాసుబాబు, పుష్పలత, ఆదినారాయణ, శ్రీనివాస్, రాము, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ అడ్డుకుంటాం: సీపీఐ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ శివారులో ఏర్పాటు కానున్న అదానీ అంబుజా సిమెంట్ గ్రెండింగ్ యూనిట్ కోసం నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని సీపీఐ నేతలు స్పష్టం చేసారు. పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి ఏ.జె.స్టాలిన్ మాట్లాడుతూ పెదగంట్యాడలో ఏర్పాటు కానున్న అదానీ అంబుజా సిమెంట్ గ్రెండింగ్ యూనిట్ వల్ల కాలుష్యం పెరిగే అవకాశం ఉందన్నారు. గంగవరం పోర్టు వల్ల ఇప్పటికే గాజువాక నియోజక వర్గం అంతా కాలుష్యం వల్ల అనేక మంది రోగాల బారిన పడ్డారని, సిమెంట్ గ్రెండింగ్ యూనిట్ రాకతో మరింత కాలుష్యం పెరిగే అవకాశం ఉందని అన్నారు. బుధవారం జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణను సీపీఐ అడ్డుకుంటుందని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ సిమెంట్ గ్రెండింగ్ యూనిట్ వల్ల గాజువాక ప్రాంతం పూర్తిగా కలుషితం అయ్యే పరిస్థితులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ, కె.వనజాక్షి, నాయకులు జి.ఆనంద్, కె.పోతయ్య, పి.దుర్గారావు, ఎల్లేటి శ్రీనివాస్, కె.అచ్యుతరావు, టి.సాంబ మూర్తి, సోమేష్ పాల్గొన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సంస్కృత సాహిత్యంలో పేరెన్నిక గల మహాకవి వాల్మీకి అని, ఆదికవిగా, మహా జ్ఞానిగా, సంస్కృతంలో రామాయణ మహా కావ్యాన్ని రచించిన మహనీయుడని, మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి అన్నారు. ఆయన మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో

జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, ఇతర అధికారులతో కలిసి మహర్షి వాల్మీకి జయంతి వేడుకను

నిర్వహించారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ప్రపంచంలో అందరూ రామాయణ గ్రంథాన్ని వాల్మీకి రామాయణంగా పిలుచుకుంటామని గుర్తు చేస్తూ వాల్మీకి జీవిత జీవిత ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, పరిపాలన విభాగాధికారి అప్పలనాయుడు, పర్యవేక్షకులు శ్రీనివాస్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్: మహా జ్ఞాని, తాత్వికుడు, సంస్కృతంలో రామాయణ మహా కావ్యాన్ని రచించి

అన్ని వర్గాల ప్రజలకు చేరువ చేసిన మహాకవి మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, వాల్మీకి సంఘ నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై అవగాహన

విశాలాంధ్ర - కొమ్మాది: చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూపర్ జీఎస్టీ 2.0 (వస్తు సేవల పన్ను)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ములుగు వెంకట్రావు, డీఈవో ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అనే అంశంపైన వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. జి.ఎస్.టి 24% నుండి 5% తగ్గించడం వలన ప్రజలకు కొనుగోలు శక్తి, పొదుపు ఏవిధంగా మెరుగుపడుతుందో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన యువ నాయకులు గంటా రవితేజ మాట్లాడుతూ ఎన్.డి.ఏ. ప్రభుత్వం ప్రజాసంక్షేమంలో భాగంగా జి.ఎస్.టిని తగ్గించడం వలన ప్రజలకి ఎంతో మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జి.ఎస్.టి. కమిషనర్ లక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ గుడే అచ్యుత రావు, 5, 6, 7 వార్డుల నాయకులు వై.జీవన్ కుమార్, నాగోతి సూర్యప్రకాష్, గరే గురునాథ్, నమ్మి రమణ, నాగోతి సత్యనారాయణ (జపాన్), నోడగల జానకిరామ్, కానూరి అచ్యుతరావు, ఈగల రవి తదితరులు పాల్గొన్నారు.

ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమకు అనుమతులు వద్దు

- వెంటనే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయండి
- నేడు ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకోవాలి
- విపక్ష ఫ్లోర్ లీడర్లు వినతి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖపట్నంలోని పెదగంట్యాడ వద్ద అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ నిర్మాణ ప్రతిపాదనను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేయుటకు వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం ఉదయం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు జీవీఎంసీ మేయర్‌కు లేఖ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాజువాకలోని పెదగంట్యాడ వద్ద జనావాసాల మధ్య 4 మిలియన్ల సామర్థ్యంతో అదానీ అంబుజా సిమెంట్ కంపెనీని నిర్మాణం చేయుటకు అక్టోబర్ 8న ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకటించిందని, ఈ సిమెంట్ కంపెనీ వల్ల గాజువాక ప్రాంతం మొత్తం ప్రమాదకరమైన దుమ్ము, ధూళి విషకణాలతో నిండిపోతుందన్నారు. ఊపిరితిత్తులు, శ్వాసకోశ, గుండె, చర్మ, కంటి, రక్తహీనత, గర్భస్రావం, క్యాన్సర్ వంటి అనేక ప్రాణాపాయ జబ్బులకు గురౌతారన్నారు. చుట్టూ ఉన్న కొన్ని వేల నివాస కుటుంబాలు తమ ఇల్లును వదిలి నిర్వాసితులు అయ్యే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. అలాగే జీవీఎంసీకి సరఫరా అయ్యే మంచి నీరు, ఏలేరు కెనాల్, నీటి రిజర్వాయర్లు అన్ని విష కాలుష్యానికి గురవుతాయన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ పౌరుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత జీవీఎంసీ ప్రజాప్రతినిధుల మీద ఉందన్నారు. అందువల్ల తక్షణమే ఎటువంటి జాప్యం లేకుండా జీవీఎంసీ కౌన్సిల్‌ను సమావేశపర్చాలని విజ్ఞప్తి చేశారు. ఆ సమావేశంలో ప్రతిపాదిత అదానీ సిమెంట్ కంపెనీని వ్యతిరేకిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసి, రాష్ట్ర ప్రభుత్వం అదానీ సిమెంట్ కంపెనీ నిర్మాణానికి అనుమతులు ఇవ్వకుండా, సిమెంట్ కంపెనీ నిర్మాణ ప్రతిపాదనలు రద్దు చేయాలని కోరారు. అదానీ సిమెంట్ కంపెనీ సిమెంట్ తయారీకి అవసరమైన సున్నపు రాయి, జిప్సం, యాష్, స్లాగ్, బొగ్గు వంటి ముడి పదార్థాలు భారీగా గుట్టలు, గుట్టలుగా నిల్వ ఉంచుతారని, ఇవన్నీ కంపెనీతో పాటు ఈ ముడిపదార్థాలు కూడా కేవలం 20ఎకరాల పరిధిలోనే నిల్వ ఉంచుతారని, అలాగే

సిమెంట్ తయారీ సందర్భంగా ముడిపదార్థాల క్రషింగ్, గ్రెండింగ్, ఆపరేషన్లో, రోజు కొన్ని వందల లారీలు, ట్రక్కులతో భయంకరమైన శబ్దధ్వనులతో ఆ ప్రాంతం మొత్తం భయానకంగా మారుతుందన్నారు. ప్రతిపాదిత అదానీ సిమెంట్ కంపెనీ నిర్మాణ 20ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వం గంగవరం పోర్టు నిర్మాణానికి మాత్రమే ఇచ్చిందని, ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ప్రాతిపదికన ఇచ్చిందన్నారు. ఈ భూమిలో ఇతర కంపెనీలు. నిర్మాణం చేయకూడదు 30ఏళ్ల మాత్రమే లీజు కాలపరిమితి అని, అదానీ గంగవరం పోర్టు అదానీ అంబుజా సిమెంట్ లిమిటెడ్ మధ్య జరిగిన 20ఎకరాల భూ ఒప్పందం కూడా చట్ట వ్యతిరేకం అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేలు, నగర ప్రథమ పౌరుడుగా ఉన్న మేయర్ వెళ్లి అడ్డుకోవాలని అభ్యంతరం తెలియజేయాలని ఈ సందర్భంగా కోరారు.

న్యాయమూర్తిపై దాడిని తీవ్రంగా ఖండించిన దుమ్మెద

విశాలాంధ్ర - ఆనందపురం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయిపై అక్టోబర్ 6న చోటుచేసుకున్న దాడిని డివిజినల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దుమ్మెద. అప్పలసూరి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన ప్రజాస్వామ్యంలో అత్యున్నత స్థానం కలిగిన న్యాయవ్యవస్థపై, అలాగే రాజ్యాంగ విలువలపై దాడిగా పరిగణించాలని ఆయన పేర్కొన్నారు. అప్పలసూరి మాట్లాడుతూ న్యాయం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ ఆశయాలను పరిరక్షించడంలో న్యాయమూర్తులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలనుంచి అత్యున్నత స్థానాన్ని అధిరోహించిన జస్టిస్ గవాయిపై ఇలాంటి దాడి జరగడం కేవలం వ్యక్తిగత దాడి కాదని, ఇది న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య అని పేర్కొన్నారు. న్యాయస్థానం లోపలే న్యాయమూర్తిపై నిరసన వ్యక్తం చేయడం అత్యంత హేయమైన, క్రమశిక్షణారాహిత్యమైన చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలకు ఎక్కడా స్థానం ఉండకూడదని, ప్రతి పౌరుడు దీనిని ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని, దేశంలోని న్యాయమూర్తుల భద్రతను మరింత బలోపేతం చేయాలని అప్పలసూరి డిమాండ్ చేశారు.0

జీఎస్టీ 2.0పై క్విజ్, వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - ఆనందపురం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జీఎస్టీ సూపర్ సేవింగ్ పథకంపై ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వివిధ రకాల పోటీలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో డాక్టర్ వి.జానకి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు సమన్వయంతో క్విజ్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసిన ఎంపీడీవో జానకి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తక్కువ జీఎస్టీ రేట్లు అమలులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పేద మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఉపయోగపడే వస్తువులపై జీఎస్టీ రేట్లు తగ్గించి, కొన్ని అవసరమైన వస్తువులపై పూర్తిగా పన్ను మినహాయింపులు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో జీఎస్టీ చిన్న వాల్టేర్ అధికారి పి.ఫాల్గుణరావు, గ్రామ కార్యదర్శి రఘునాథ్ బాబు, డిజిటల్ అసిస్టెంట్ చందక వెంకట్రావు, వెల్ఫేర్ అసిస్టెంట్ మనోహర్, ఉపాధ్యాయులు భాస్కరరావు, ముత్యాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థినులు పట్ల నిర్లక్ష్యం తగదు

- పిడిఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ ధ్వజం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: గిరిజన విద్యార్థుల జీవితాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.సురేష్ ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. పల్లె పల్లెకు మద్యం పంపే ప్రభుత్వం గిరిజన పిల్లలకు మంచినీళ్ళు ఎందుకివ్వదని నిలదీశారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో చోటుచేసుకున్న విషాదకర ఘటన గిరిజన విద్యార్థుల జీవితాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని మరోసారి బహిర్గతం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో 5వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదువుతున్న 611 మంది బాలికల్లో ఇద్దరు విద్యార్థినులు తోయిక కల్పన (9వ తరగతి), పువ్వల అంజలి (10వ తరగతి) పచ్చకామెర్లతో మరణించగా, 120 మందికి పైగా విద్యార్థినులు అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. 37 మందిని విశాఖ కేజీహెచ్‌లో, మిగిలినవారిని పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్సకు చేర్చినట్లు పేర్కొన్నారు. వైద్యుల ప్రకారం, కలుషిత నీటిని తాగడం వలన విద్యార్థినులు పచ్చకామెర్ల బారిన పడ్డారని నిర్ధారిం చడం జరిగిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కా రానికి చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వ కాలంలో 40 మందికి పైగా విద్యార్థులు అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయినా ప్రస్తుత ప్రభుత్వం వాటి నుంచి గుణపాఠాలు నేర్చుకోకుండా అదే తప్పిదాలను పునరావృతం చేయడం శోచనీయమన్నారు. ఐటిడిఎ పరిధిలోని 90 శాతం ఆశ్రమ పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉందని, పాడైన వాటర్ ప్లాంట్లను మరమ్మతు చేయకపోవడం, పౌష్టికాహారం అందకపోవడం, రక్తహీనత, జ్వరాలు, పచ్చకామెర్లు వంటి వ్యాధులు విస్తరిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వాలు మారినా పాలనలో మార్పు లేదని మండిపడ్డారు. సంఘటనకు బాధ్యులైన అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని తక్షణమే సస్పెండ్ చేసి సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలకు తక్షణ నష్టపరిహారం చెల్లించి, అన్ని గిరిజన పాఠశాలల్లో ఆరోగ్య పరీక్షలు, నెలవారీ వైద్య శిబిరాలు నిర్వహించి పాడైన ఆర్ఓ ప్లాంట్లను పునరుద్ధరించాలని కోరారు. ప్రతి పాఠశాలలో రెగ్యులర్ వైద్య సిబ్బందిని నియమించి, పారిశుధ్య సిబ్బందికి పెండింగ్ జీతాలు చెల్లించాలని, ఆహార నాణ్యత, హాస్టల్ పరిస్థితులు, ఆరోగ్య భద్రతపై ప్రత్యేక విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అన్ని గిరిజన విద్యాసంస్థల స్థితిగతులపై ప్రభుత్వం తక్షణం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి రాజ్యాంగ విరుద్ధం

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
ఏఎంసీ ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్ డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ మీద న్యాయవాది రాకేష్ కిషోర్ బూటుతో దాడి చేయడాన్ని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (ఏఎంసీ) తీవ్రంగా ఖండిస్తున్నట్లు సొసైటీ ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం అంబేద్కర్ భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనిషిని మనిషిగా చూసే సమాజ నిర్మాణం కోసం అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. మనిషిని కులంగా చూసే దృక్పథం ఇంకా మారలేదని ఇది ఆర్ఎస్ఎస్ బిజెపి చేసిన ప్రచారానికి నిదర్శనం అన్నారు. చీఫ్ జస్టిస్ గవాయ్ తమ సొంత రాష్ట్రం మహారాష్ట్ర మొదటిసారి వెళ్ళినప్పుడు ప్రోటోకాల్ పాటించాల్సిన చీఫ్ సెక్రెటరీ, డిజిపి హాజరు కాకుండా ఆయనని తీవ్రంగా అవమాన పరిచారన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పార్లమెంటు భవనం ప్రారంభోత్సవానికి కూడా పిలవలేదని, చీఫ్ జస్టిస్ గవాయ్ తల్లిని ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాల వేడుకలకు పిలిస్తే తాను అంబేద్కర్ వాదినని, బుద్ధిస్టనని ఆమె హాజరయ్యేందుకు నిరాకరించారని చీఫ్ జస్టిస్ మీద దాడికి ఇది కూడా ఒక కారణం అని తాము భావిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్లు కాంతారావు, ఎస్.రాజులు, అప్పారావు, పడమట్ల గంగరాజు, బైరవమూర్తి, లక్ష్మణరావు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ బంగారమ్మ తల్లి పండుగ

విశాలాంధ్ర - పద్మనాభం: కృష్ణాపురం పంచాయతీలో మంగళవారం శ్రీ బంగారమ్మ తల్లి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ అమ్మవారి పండగకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులే కాక ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. సుంకరి వారి కుటుంబాల ఆధ్వర్యంలో శ్రీ బంగారమ్మ తల్లి పండుగను ప్రతి ఏటా ఎంతో ఘనంగా నిర్వహించటం ఆనవాయితీ. ఉదయం నుండి గ్రామస్తులంతా ఏకమై అమ్మవారికి పసుపు, కుంకాలు సమర్పించి, మ్రొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం సాయంకాలం కృష్ణాపురం వీధులలో డీజేలు పెట్టి, కోలాటం, తప్పిట గుళ్ళు కార్యక్రమాల మధ్య అమ్మవారి పండుగను ఎంతో ఘనంగా నిర్వహించారు.

డోనార్ కాటేజీ పథకం ఉందా.... ? లేదా....?

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్రలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వరహాలక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం కోట్ల రూపాయలతో దివ్యక్షేత్రంగా అభివృద్ధి చేయడానికి రూపొందించిన దేవస్థానం మాస్టర్ ప్లాన్‌లో దాతలను భాగస్వాములను చేయాలన్న ఆలోచనే చేయకపోవడం శోచనీయం. దేవస్థానం తన సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపడితే దశాబ్ది కాలమైనా నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతుందా? అన్నది అనుమానమే. ఏడాదికి సుమారుగా 10 కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టుకోగల ఆర్థిక స్తోమత దేవస్థానానికి ఉందని చెబుతున్న అధికారులు ప్రాధాన్యత క్రమంలో పనులు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో దేవస్థానం దాతల సహకారాన్ని తీసుకోవడం ఎంతైనా అవసరం. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో దాతల భాగస్వామ్యంతో జరిగిన అభివృద్ధి పనులు అనేకం మనకు కనిపిస్తాయి. ప్రధానంగా సత్రాలు, కాటేజీలు (వసతులు) నిర్మాణంలో దాతల భాగస్వామ్యం చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ విషయంలో సింహాచలం దేవస్థానం వెనుక వరసలో ఉంటుందనడంలో సందేహం లేదు. దాతల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున కాటేజీల నిర్మాణం చేపట్టాలని రెండు వేల ఎనిమిదో సంవత్సరంలో అప్పటి దేవాదాయ శాఖ కమిషనర్ సుందర కుమార్ ప్రతిపాదించారు. అదే సమయంలో దేవస్థానం ఇన్‌చార్జి ఈవో (పూర్తి అదనపు బాధ్యతలు) రామచంద్రమోహన్ 'డోనార్ స్కీమ్' పేరుతో ఒక పథకాన్ని రూపొందించారు. 400 చదరపు గజాల స్థలంలో ఒక్కొక్క కాటేజీ 25 లక్షల రూపాయల వ్యయంతో 40 కాటేజీలను నిర్మించాలని నిర్ణయించారు. ఆసక్తి గల దాతలు లక్ష రూపాయలు డిపాజిట్ (రిఫండ్) చేసి పేర్లు నమోదు చేసుకోవాలని, దేవస్థానం ప్రణాళిక ప్రకారం ఎవరికి కేటాయించిన స్థలంలో వారే స్వయంగా నిర్మాణం చేయించుకొని దేవస్థానానికి అప్పగించాల్సి ఉంటుందని, నిర్వహణ బాధ్యత మాత్రం దేవస్థానమే వహిస్తుందని, ఏడాదిలో 45 రోజులు దాతలకు ఉచితంగా కాటేజీ ఇవ్వడం జరుగుతుందని నిబంధనలు నిర్ణయించింది. ఈ మేరకు బ్రోచర్‌ని కూడా విడుదల చేసింది.

రామచంద్రమోహన్‌ని సింహాచలం ఈవో అదనపు బాధ్యతల నుండి తప్పించడం కొత్తగా వచ్చిన ఈవోలు కాటేజీల పథకం పై దృష్టి పెట్టకపోవడం.. ఇంజినీరింగ్ అధికారులు ఆ ప్రస్తావనే తీసుకురాకపోవడం శాపంగా మారి ' డోనార్ కాటేజీ పథకం ' మూలన పడింది. దివ్యక్షేత్రం ప్రణాళిక తుది మెరుగులు దిద్దుకుంటున్న నేపథ్యంలో

దేవస్థానం అధికారులు ' డోనార్ కాటేజీ స్కీమ్ 'కి మళ్ళీ జీవం పోసే దిశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దేవస్థానం ప్రకటనిస్తే ఆ సింహాద్రి నాథుని పిలుపుగా భావించి సాధారణ భక్తులు కూడా దాతల అవతారమెత్తి తమ శక్తి మేరకు అభివృద్ధిలో పాలు పంచుకుంటారనడంలో సందేహం లేదు.

పిఆర్ఎస్ఐ విశాఖ చాప్టర్ వైస్ చైర్మన్‌గా కె.బంగార్రాజు

విశాలాంధ్ర - పెందుర్తి: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ) విశాఖపట్నం చాప్టర్ వైస్ చైర్మన్‌గా శంకర్ ఫౌండేషన్ కంటి హాస్పిటల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (పిఆర్) కె.బంగార్రాజును షభ్యులు ఎన్నుకొన్నారు. విశాఖ నగరంలో జరిగిన పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (విశాఖపట్నం చాప్టర్) వార్షిక సాధారణ సమావేశములో 2025-27 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో ఎంకేఎల్ఎన్ నరసింహ మూర్తిని చైర్మన్‌గా రెండవసారి ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు కే.రామారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, పిఆర్ఎస్ఐ కార్య వర్గ సభ్యులు వైస్ చైర్మన్ కె.బంగార్రాజును ఎన్నుకున్నారు. అనంతరం బంగార్రాజును సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ ఎక్కువ మంది సభ్యులను ఈ చాప్టర్లో నమోదు చేయడం ద్వారా వైజాగ్ చాప్టర్ ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక ప్రాంతమైన విశాఖ నగరంలో అనేక పరిశ్రమలు, ఆసుపత్రులు, సంస్థల్లో పనిచేస్తున్న ప్రజా సంభంధాల అధికారులు ఈ చాప్టర్లో చేరి పిఆర్ఎస్ఐ బలోపేతానికి సహకరించాలని కోరారు. సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ అజిత్ పాథక్, డాక్టర్ పి ఎల్ కే మూర్తి సెక్రటరీ జనరల్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియచేసారు. సీనియర్ కార్యవర్గ సభ్యులైన చెరువు రామకోటయ్య చాప్టర్ బలోపేతానికి అనేక సూచనలు చేసి నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియచేసారు. ఈ కార్యక్రమములో చాప్టర్ సభ్యులు అను, మణిమాల, ప్రకాష్ తదితర సభ్యులు పాల్గొన్నారు. కాగా పిఆర్ఎస్ఐ ఇతర కార్యవర్గసభ్యులుగా ఆర్పి శర్మ (వైస్ చైర్మన్), ఏ.గోవిందరావు (కార్యదర్శి), నరసింహం (గీతంయూనివర్సిటీ) ట్రెజరర్‌గా నాగేశ్వర్ రావు (జీవీఎంసీ) వై. శ్రీనివాసరావు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలియచేసారు.

ఓట్ల దొంగ, గద్దె దిగండిపై కాంగ్రెస్ సంతకాలు సేకరణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ గారు చేపట్టినటువంటి "ఓట్ చోర్ గద్దె చోడ్" అనే నినాదంతో "ఓట్ల దొంగ, గద్దె దిగండి" అని రాహుల్ గాంధీకి మద్దతుగా ఏర్పాటు చేసిన ర్యాలీకి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు సుంకర పద్మశ్రీ, కడప జిల్లా మాజీ అధ్యక్షులు, గుండ్లకుంట్ల శ్రీరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్రజాస్వామిక మోడీ విధానాలపై గళమెత్తిన రాహుల్ గాంధీ చేస్తున్న ప్రజాస్వామ్య పోరాటానికి

మద్దతుగా విశాఖపట్నంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేసి, రాహుల్ గాంధీ ప్రయత్నానికి మద్దతుగా ర్యాలీ, సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమం విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ రామనగరం మీదుగా సెవెన్ హిల్స్ హాస్పిటల్ వరకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జిల్లా మాజీ అధ్యక్షులు వజ్జిపర్తి శ్రీనివాసరావు, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన గుత్తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో , విశాఖ మహిళా అధ్యక్షులు మౌనిక రెడ్డి తదితరులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏఐ పవర్డ్ పండగ క్యాంపైన్‌ను ప్రారంభించిన రాయల్ స్టాగ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: రోహిత్ శర్మతో ఏఐ పవర్డ్ పండగ క్యాంపైన్‌ను రాయల్ స్టాగ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ అందుబాటులోకి తీసుకుపోతున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు."లివ్ ఇట్ లార్జ్"గా ఉండటానికి పండగలు సరైన సందర్భాలు అని, బ్రాండ్ యొక్క జనరేషన్ లార్జ్ సిద్ధాంతం యొక్క ప్రేరేపణపై, ఈ ఏడాది కాంపైన్ సంస్కృతిలో లోతుగా పాతుకున్న టెక్ ఫార్వర్డ్, ఏఐ ఆధారిత అనుభవాన్ని ఆవిష్కరిస్తుందన్నారు. మరియు బ్రాండ్ యొక్క లివ్ ఇట్ లార్జ్ సిద్ధాంతంతో యువతరం కోరికను సొగసుగా అల్లుకుని వినియోగదారులను సంబరంలో ప్రధాన ఆకర్షణగా ఉంచుతుందన్నారు. కాంపైన్ ప్రధాన అంశంలో ఒక కార్యక్రమం భాగంగా ఉందని, పండగ శుభాకాంక్షలను పరస్పరం పంచుకునే విధానాన్ని పునః ఊహించింది. రీజనరేటివ్ ఏఐ మరియు ఆధునిక స్వరం సంశ్లేషణలను ఉపయోగిస్తూ, రాయల్ స్టాగ్ వారి కొత్త పండగ శుభాకాంక్షల అనుభవాన్ని అభిమానులు రోహిత్ శర్మతో పాటు వ్యక్తిగత వీడియో శుభాకాంక్షలతో సృష్టించవచ్చు. సహజమైన సంభాషణల రూపంలో రూపొందించబడిన, వినూత్నమైన, వాస్తవమైన శుభాకాంక్షలు పండగ కోరుకును కనక్షన్ క్షణంగా మరియు సెలబ్రేషన్ లార్జ్ స్ఫూర్తి యొక్క నిజమైన సూచనగా మారుస్తాయని చెప్పారు.

భీమిలి కంచుకోటలో ఫలితాలు ఏకపక్షం..

కొత్త కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో గంటా

విశాలాంధ్ర - తగరపువలస: టీడీపీ కంచుకోటైన భీమిలి నియోజకవర్గంలో ఏ ఎన్నికలు వచ్చినా ఘన విజయాలు నమోదు చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కొత్తగా నియమించిన భీమిలి రూరల్ మండలం కమిటీతో మంగళవారం ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో రీ సౌండ్ వచ్చేలా 93 వేల మెజారిటీ ఇచ్చిన భీమిలిని అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటున్నానని చెప్పారు. జీవీఎంసీలో వీలీనమైతే కార్పోరేషన్ ఎన్నికల్లో.. లేని పక్షంలో పంచాయతీ, ఎంపీపీ, జెడ్పీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలిచి సత్తా చాటాలన్నారు. ప్రపంచంలోనే మొదటిసారిగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసిందని తెలిపారు. భీమిలి రూరల్ అధ్యక్షుడు సరగడ అప్పారావు కూడా తనలాగే ఓటమి ఎరుగని నేత అని.. ఆయన సారథ్యంలో పార్టీ మరింత బలోపేతం అవ్వాలని ఆకాంక్షించారు. చెప్పిన హామీలతో పాటు వాహన మిత్ర వంటి చెప్పని వాటిని కూడా నెరవేర్చామన్నారు. ఇంట్లో పిల్లలందరికీ అమ్మఒడి ఇస్తానని, చివరికి ఒక్కరికే ఆ పథకం ఇచ్చి మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి, పెన్షన్ పెంచే విషయంలోనూ ప్రజలను వంచించారని విమర్శించారు. జీఎస్టీ సంస్కరణల వల్ల దేశ ఎకానమీ అగ్ర దేశాలతో పోటీ పడుతుందన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని మోదీ.. విజనరీ సీఎం చంద్రబాబు.. జనాకర్ష నేత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ల నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రపథాన దూసుకుపోతోందని చెప్పారు. యువ నాయకుడు గంటా రవితేజ మాట్లాడుతూ సంక్షేమాన్ని, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. కొత్త కమిటీ ఆధ్వర్యంలో విజయ యాత్ర కొనసాగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సరగడ అప్పారావు మాట్లాడుతూ పార్టీని శక్తిమంతంగా నడిపించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, ఆనందపురం పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, పద్మనాభం పార్టీ అధ్యక్షుడు కోరాడ రమణ, కార్పొరేటర్ లొడగల అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు అప్పలనాయుడు, సూరాల సత్య వరప్రసాద్, గొలగాని నరేంద్ర,అక్కరమాని వెంకట్రావు, చెట్టిపల్లి గోపీ, మొల్లి లక్ష్మణరావు, పొట్నూరి లక్ష్మణ్, డి.ఎస్.ఎన్.రాజు, కురుమిన లీలావతి, పాసి నరసింగరావు, గరే గుర్నాథ్, వాండ్రాసి అప్పలరాజు, గాడు తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అవంతి కాలేజీ జంక్షన్ నుంచి చిప్పాడ వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానికంగా ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అమానుషం

పెందుర్తి అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర - పెందుర్తి: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై న్యాయవాది రాకేష్ కిషోర్ దాడికి పాల్పడటం అమానుషమని పెందుర్తి బిఆర్ అంబేద్కర్ సేవా సమితి ప్రతినిధులు ఆంధోళన వ్యక్తం చేసారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బోనాల యేసు జోసఫ్, ప్రధాన కార్యదర్శి తోట సుబ్బారాయుడు మాట్లాడుతూ భారత ప్రధాని న్యాయవాది బి.ఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడటం హేయమైన చర్య అని ఖండించారు. న్యాయస్థానంలో దాడికి పాల్పడిన న్యాయవాదిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి దాడులు రాజ్యాంగ ఉనికికే ప్రమాదకరంగా పరిగణించాలన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న వారిపై ఇటువంటి దాడులు కి పాల్పడుతుంటే ఇక బడుగు బలహీన వర్గాల దళితుల పరిస్థితి ఏంటో తేటతెల్లమవుతుందని పేర్కొన్నారు. తక్షణమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కల్పించుకొని దాడికి పాల్పడ్డ న్యాయవాదిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

లేని పక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సమితి ప్రతినిధులు మంతెన అప్పారావు, కల్పనా, అప్పలసూరి, జీవన్ కుమారు, రాఘవులు దళిత సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీఎస్టీపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కృష్ణపురం గ్రామంలో ఉన్న కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయంలో జీఎస్టిపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల అభివృద్ధి అధికారి రూపేష్ , మండల విద్యాశాఖ అధికారి రమణ విద్యార్థినులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాలయంలో జరిగిన పోటీలను పరిశీలించారు. దేశవ్యాప్తంగా రోజూ వారీ ఉపయోగించే కిరాణా సామాగ్రి,నిత్యావసరాలు, మందులు, స్టేషనరీ మొదలైన వస్తువులలో తగ్గిన జీఎస్టి గురించి అవగాహన కల్పించారని ప్రిన్సిపాల్ కె. గ్రేస్ లిల్లీ తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి, వాటిలో గెలుపొందిన వారికి బహుమతులను అతిధుల చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

నిస్సాన్ తాజా సి ఎస్యూవీ నిస్సాన్ టెక్టన్ విడుదల

విశాలాంధ్ర - విశాఖపట్నం: నిస్సాన్ మోటార్ ఇండియా గ్లోబల్ ఎస్‌యూవీ లైనప్‌కు సరికొత్త ఎడిషన్ కోసం డిజైన్ యొక్క ప్రివ్యూ సరికొత్త నిస్సాన్ టెక్టన్‌ను ఆవిష్కరించినట్టు నిస్సాన్ మోటార్ మేనేజింగ్ డైరెక్టర్ సౌరాబ్ వాట్సా తెలిపారు. నిస్సాన్ ఆశయాన్ని ప్రతిబింబించే పేరుగా టెక్టన్ ఉంటుందన్నారు. ఇది నిస్సాన్ యొక్క ఖచ్చితమైన ఇంజనీరింగ్ జీవితాలను సుసంపన్నం చేసే ఆవిష్కరణల నీతితో సమం చేస్తుందని, ఈ పేరు శక్తివంతమైన, ప్రీమియం సిఎస్‌యువిని సూచిస్తుందన్నారు. ఇది ఇంజనీరింగ్ ఎక్సలెన్స్, పనితీరు మరియు విలక్షణమైన డిజైన్ గుర్తింపును కలిగి ఉంటుందన్నారు. టెక్టన్ వారి కెరీర్లు, అభిరుచులు లేదా జీవనశైలి ద్వారా "వారి ప్రపంచాన్ని రూపొందిస్తున్న" వారికి ఎంపిక అవుతుందన్నారు. 2026లో దాని పూర్తి ఆవిష్కరణ మరియు అమ్మకాల ప్రారంభానికి ముందు, టెక్టన్ సి ఎస్యువి విభాగంగా రూపొందించ బడిందన్నారు. ఇది నిస్సాన్ యొక్క 'వన్ కార్, వన్ వరల్డ్' స్ట్రాటజీ కింద రెండవ ఉత్పత్తి అవుతుందని, ఇది చెన్నై ప్లాంట్‌లో రెనాల్ట్‌తో కలిసి భారతదేశంలో అమ్మకానికి మరియు ప్రపంచ మార్కెట్లను ఎన్నుకోవటానికి భవిష్యత్తు ఎగుమతిగా నిలుస్తుందన్నారు.

పండుగ సీజన్ కోసం అమెజాన్ కన్స్యూమర్ సురక్షా మార్గదర్శకం

విశాలాంధ్ర - విశాఖపట్నం: పండుగలు సందర్భంగా జరిగే ఆన్లైన్ కొనుగోళ్ల విషయంలో చెల్లింపు జరిపేందుకు ముందు వెబ్సైట్లను తనిఖీ చేయటం, మల్టీఫ్యాక్టర్ అథెంటికేషన్ ఆన్ చేయటం, బ్యాంకు స్టేట్మెంట్లను చెక్ చేసుకోవటం, ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే ఫిర్యాదు చేయటం వంటి కొన్ని అలవాట్లు, ప్రమాదావకాశాలను తగ్గించి వేస్తాయని అమెజాన్ ఇండియా ప్రతినిధి రాకేష్ బక్షి చెప్పారు. అమెజాన్ వంటి కంపెనీలు సురక్షితమైన ఈమెయిల్ సిగ్నల్స్ (అందుకే అసలైన సందేశాలు అమెజాన్ స్మైల్ ఐకన్ను ప్రైమరీ ఇన్బాక్సులలో చూపుతాయి)లో, ప్రజా-విద్యా భాగస్వామ్యాలు, ఇంకా ప్రత్యేకించిన ఇన్వెస్టిగేటర్లు మరియు ఒక స్థాయి షాపర్లను రక్షించేందుకు కృషి చేసే మెషీన్ లెర్నింగ్ నిపుణుల పై పెట్టుబడి పెడుతున్నాయి. తత్ఫలితంగా లభిస్తోంది: "యాడ్ టు కార్ట్ " మొదలుకుని "ఎరైవ్డ్" వరకు ఒక ఆటంకాలు లేని, సురక్షితమైన మార్గం అన్నారు. అమేజాన్ ఇండియా వారి మోసాలు లేని సెప్టెంబర్ ను పాటించడానికి ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్, హోం వ్యవహారాల శాఖతో భాగస్వామ్యం ద్వారా ఈ ప్రయత్నం మరింత శక్తివంతంగా మారిందన్నారు. తెలివిగా మరియు సురక్షితంగా కొనుగోళ్లు చేయడానికి వారికి అవసరమైన విజ్ఞానం వినియోగదారులకు కలిగించడానికి ఐ4 సీతో, అమేజాన్ మీడియాలో అవగాహనా కార్యక్రమాలను మరియు డిజిటల్ ప్లాట్ ఫాంలను నిర్వహిస్తోంది.

ఉద్యోగ ఆధారిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - పద్మనాభం: నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణనిచ్చి, ఉద్యోగావకాశాలను కల్పించాలని ఎపి మెప్మా మిషన్ డైరెక్టర్ నిర్ణయించిన నేపథ్యంలో తమ పరిధిలోని నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు, వివరాలను సేకరించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపిడిఓ కె.రూపేష్ ఆదేశించారు. మండలంలోని గ్రామపంచాయతీలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు పద్మనాభం, విశాఖపట్నంలోని బొల్లినేని మెడ్స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీకాకుళం, విశాఖపట్నంలోని నిరుద్యోగ యువతకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వివిధ రంగాలలో ప్లేస్మెంట్ లింక్డ్ స్కిల్ డెవలప్మెంట్ శిక్షణను ఇవ్వడానికి చొరవ తీసుకున్నారన్నారు. సమర్థవంతమైన అభ్యాసం, మెరుగైన బోధనా పద్ధతులు ద్వారా అభ్యర్థులకు కోర్ కంటెంట్, ఆచరణాత్మక శిక్షణను భోజన, వసతి సౌకర్యం కల్పించి ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 - 28 ఏళ్ల వయస్సు గల ఆసక్తిగల నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను స్వీకరించారని కోరారు. దీనిపై గ్రామాల్లో దండోరా వేసి ప్రచారం చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు బొల్లినేని మెడ్స్కిల్స్, పిఆర్ బషీర్ అహ్మద్ను 79930116050 నెంబరులో సంప్రదించాలని సూచించారు.